క్లుప్తంగా

శ్రీవారి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడిగా గంటి ప్రమాణస్వీకారం


శ్రీవారి ఆలయ నూతన ట్రస్టుబోర్డు సభ్యుడిగా సంతకం చేస్తున్న చినసర్వేశ్వరరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ నూతన ట్రస్టు బోర్డు సభ్యుడిగా తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెంకు చెందిన గంటి చినసర్వేశ్వరరావు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన ముప్పిడి సంపత్‌కుమార్ ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడి పదవికి ఇటీవల రాజీనామా చేయడంతో, ఆయన స్థానంలో చినసర్వేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దీన్ని పురస్కరించుకుని చినసర్వేశ్వరరావు కుటుంబ సభ్యులు ఉదయం ఆలయానికి విచ్చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించి, ఆలయ ముఖ మండపంలో అర్చకుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. అనంతరం ప్రమాణస్వీకారం చేసి పదవిని చేపట్టారు.

గాజాపై దాడులు నిలిపివేయాలి

జంగారెడ్డిగూడెం: గాజాపై ఇజ్రాయెల్ సైనిక దాడిని నిలిపివేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ, కారం రాఘవ డిమాండ్ చేశారు. పాలస్తీనాలో భాగమైన గాజాపై అమెరికా ప్రోత్సాహంతో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణ హోమాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్రకమిటీ పిలుపు మేరకు సోమవారం జంగారెడ్డిగూడెంలో ర్యాలీ, సభ నిర్వహించారు.

మాతాశిశు మరణాల నివారణకు ప్రత్యేక కృషి

బుట్టాయగూడెం: మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా గర్భిణులలో రక్తహీనతను నివారించేందుకు అక్షజ కార్యక్రమంలో 6 నెలల పాటు పౌష్టికాహార కిట్‌లను అందజేయనున్నట్లు ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, మార్పు ట్రస్ట్ ఆర్గనైజర్ సూయిజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అక్షజ కార్యక్రమం అమలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం మండలాల్లో న్యూట్రిషన్ పైలట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ద్వారకాతిరుమల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను నిర్వహించారు. ఈ ప్రదర్శనా స్టాల్స్‌ను జెడ్పీటీసీ శామ్యూల్ ప్రారంభించారు. అనంతరం మండల వ్యవసాయశాఖ అధికారి దుర్గారమేష్, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌ఛార్జి గోపాల కృష్ణమూర్తి మాట్లాడుతూ రైతు నుంచి నేరుగా వినియోగదారులకు అతి తక్కువ ధరలకు పౌష్టికాహారాన్ని అందించాలన్న ఉద్దేశ్యంతో ఏలూరు జిల్లా డీపీఎం తాతారావు ఆదేశాల మేరకు ఈ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను చేపట్టినట్టు తెలిపారు.

కామవరపుకోట: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులైన కూరగాయలు, ఆకుకూరలు స్టాల్‌ను జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్ ప్రారంభించారు.

బాల్య వివాహాలను నిరోధించాలి


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జంగారెడ్డిగూడెం సీడీపీవో పి.బ్యూలా అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలన కోరుతూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మసీదు సెంటర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం నేరమని, దీనికి బాధ్యులైన ప్రతి ఒక్కరికి రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. బాల్య వివాహంపై సమాచారాన్ని 112 లేదా చైల్డ్‌లైన్ 1098 నెంబర్‌కు తెలియజేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

కుకునూరు: బాల్య వివాహాలను నిర్మూలిద్దాం అంటూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఇన్‌ఛార్జ్ సీడీపీవో లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ద్వారకాతిరుమల: బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ తిరుపతిరావు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్ ప్రారంభించారు.

కొయ్యలగూడెం: పొంగుటూరు సెక్టార్ పరిధిలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహ వ్యవస్థ అనర్థాలపై అవగాహన, సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, అధికారులు, ఐసీడీఎస్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యం


జంగారెడ్డిగూడెం రూరల్: దేవులపల్లిలో దగ్గరుండి వృద్ధురాలికి కంటి పరీక్షలు చేయిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా


కామవరపుకోట: సాగిపాడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడుతున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా కోరారు. మండలంలోని దేవులపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. వైద్యులు ప్రజలకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోరేపల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ ప్రగడ వెంకటలక్ష్మి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, పార్టీ డాక్టర్స్ వింగ్ జిల్లా సెక్రటరీ కటారి సీతారాంబాబు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చింతలపూడి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మండల పరిషత్ అధ్యక్షుడు డా బీ రాంబాబు నాయక్ అన్నారు. మండలంలోని గణిజర్ల సచివాలయంలో సోమవారం సర్పంచ్ బొల్లిన వెంకట్రావు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై ఐసీడీఎస్ పీఓ మాధవి అవగాహన కలిగించారు. వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కృష్ణ జ్యోతి, సర్పంచ్ బొల్లిన వెంకట్రావు, యండపల్లి సర్పంచ్ యడ్ల మోహన్ రావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎంఈఓ -2 కిరణ్ బాబు, సచివాలయ కన్వీనర్ బుల్లా దాస్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు గంధం చంటి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

లింగపాలెం: ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ చలగుళ్ల రవి బాబు అన్నారు. కలరాయునగూడెంలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 284 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, ప్రజాప్రతినిధులు చేతులమీదుగా మందులు, కిట్లు పంపిణీ చేశారు. బాల్యవివాహాలను నిర్మూలిద్దాం అని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం, ఎంఈఓ కె రామారావు, పార్టీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి 21 తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష

జంగారెడ్డిగూడెం: ఈ నెల 18 నుంచి 21 వరకు జంగారెడ్డిగూడెం పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీన డాంగేనగర్ సచివాలయం, 19న అశ్వారావుపేట-2 సచివాలయం పరిధిలోని ప్రజలకు స్థానిక సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో, 20న అశ్వారావుపేట-1 సచివాలయం, 21న గౌరీశంకరపురం సచివాలయం పరిధిలోని ప్రజలకు స్థానిక త్రివేణీ కళాశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి పథకం.. విజయవంతం

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రతి పథకం విజయవంతం అవుతోందని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యంలో యర్రంపేట సచివాలయం-1 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దళారులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న రోగుల అభిప్రాయాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను ప్రారంభించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, సర్పంచ్ చాపల ఏసురత్నం, ఎంపీటీసీ నారా అన్నపూర్ణాదేవి, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ చింతలపూడి కిషోర్, ఉస్సే బాబురావు తదితరులు పాల్గొన్నారు.

గడ్డపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

పోలవరం రూరల్: మండలంలో మారుమూల గ్రామపంచాయతీ గడ్డపల్లిలో సోమవారం జగన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ పంచాయతీకి చేరాలంటే సరైన రవాణా వ్యవస్థ లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించి ప్రజలకు వైద్యసేవలు అందించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ బి.సుమతి, వైద్యాధికారి పి.రేణుక ఈ గ్రామానికి చేరుకుని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఈ వైద్యశిబిరంలో గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత

టి.నరసాపురం: ప్రజారోగ్య పరిరక్షకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు, కె.జగ్గవరం సహకార సంఘం చైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు అన్నారు. బందంచర్ల గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ కల్పనా రాణి సిబ్బందితో కలిసి వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత భారత్ నిర్మాణానికి కృషి చేద్దాం అని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ మంగాకుమారి, ఎంఈఓ కళ్యాణి, పోలవరం మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ బొట్ల విశ్వనాథం, సర్పంచ్ గుండె వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ శ్రీనివాస్, నాయకులు ఆచంట కుటుంబరావు, రాయపాటి హరి కిషోర్, రాచప్రోలు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో రోగుల కళ్లల్లో సంతోషం

కామవరపుకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి గ్రామంలో, రోగుల కళ్లల్లో సంతోషం కనబడుతుందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. సోమవారం సాగిపాడులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో పేదలు వైద్యం పొందాలంటే సరైన వైద్యం అందకపోవడంతో పాటు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే వారిని, కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా, రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం అందిస్తూ, ప్రతి ఒక్కరికి ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తున్నారని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. జెడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచ్ గుండుగోలు సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, వెర్రి శ్రీను, తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ మరిడియ, డాక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట


ద్వారకాతిరుమల: నారాయణపురంలో వృద్ధురాలికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని నారాయణపురంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం పలువురు రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు మెరుగైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలన్న సంకల్పంతో జగన్నన్న ముందుకెళ్తున్నారని అన్నారు. పేదలకు జరుగుతున్న మేలును చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ పెద్దిన దిలీప్, ఎంపీటీసీ కొప్పిశెట్టి గంగ, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, దాకారపు అగ్గియ్య, తహసీల్దార్ పి.సతీష్ తదితరులున్నారు.


లింగపాలెం: కలరాయునగూడెంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు


పోలవరం రూరల్: గడ్డపల్లిలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి


టి.నరసాపురం: బందంచర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం: యర్రంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన


చింతలపూడి: గణిజర్లలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ, సర్పంచ్

జగజ్జననీ.. పాహిమాం


ద్వారకాతిరుమల: గాయత్రీ దేవిగా శ్రీవారి క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ


జంగారెడ్డిగూడెం: బాలా త్రిపుర సుందరి దేవిగా ముత్యాలమ్మ


కొయ్యలగూడెం: గాయత్రీ దేవిగా శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ


బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ


టి.నరసాపురం: గాయత్రి దేవి అలంకరణలో కనకదుర్గమ్మ

జంగారెడ్డిగూడెం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు పలుచోట్ల గాయత్రీ మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ తల్లిని గాయత్రి దేవి అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కేతినేని నాగబాబు, యర్రం ఉదయ్‌కుమార్ దంపతులు ప్రసాద వితరణ చేయగా కేవీడీఎస్ఆర్ ప్రసాద్ దంపతులు అమ్మవారి అలంకరణకు చీరను అందజేశారు. నూకాలమ్మ అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులతో పూజలందుకుంది. ఉదయం స్వర్ణ పుష్పార్చన, సాయంత్రం బాలా కుమారి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి నాగూరి మల్లికార్జునరెడ్డి, కళ్యాణి దంపతులు రూ.25,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద వేంచేసియున్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, జెడ్పీ హైస్కూల్ వద్ద కొలువై ఉన్న కనకదుర్గమ, పాత ఆంధ్రాబ్యాంకు వీధిలో ఉన్న విజయదుర్గమ్మ గాయత్రిదేవిగా పూజలందుకున్నారు.

ద్వారకాతిరుమలలో...

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు, ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు సోమవారం వేదమాత శ్రీ గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు రోజుకో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అందులో భాగంగా పంచ ముఖాలతో, శంకుచక్రాలు, వజ్రాయుధాలను ధరించి అభయహస్త వరప్రదాయనిగా కొలువైన అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వేదమాతగా కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: శరన్నవరాత్రులలో భాగంగా రెండవ రోజు సోమవారం వేదమాత గాయత్రి అలంకరణతో కనకదుర్గమ్మ విశేష పూజలు అందుకుంది. యర్రంపేటలో గ్రామ దేవత శ్రీ అంకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొయ్యలగూడెంలోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ, కన్నాపురంలోని శ్రీ విజయలక్ష్మి కనకదుర్గమ్మ వేదమాత గాయత్రీ దేవి అలంకరణతో పూజలు అందుకున్నారు. బయ్యనగూడెంలోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ బాలా త్రిపుర సుందరిగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు బ్రహ్మచారిణి అలంకరణతో విశేష పూజలు అందుకున్నారు.

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ ఆలయంతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిర్లలో అమ్మవార్లను గాయత్రీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక కొత్తపేటలో దొరమామిడి, స్థానిక త్రిశక్తిపీఠంలో దసరా ఉత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. జీలుగుమిల్లిలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం పలుచోట్ల అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు.

టి.నరసాపురం: మండల కేంద్రమైన టి నరసాపురంలోని కనక దుర్గ అమ్మవారి ఆలయంలో, పెరుగ్గూడెంలో కనకదుర్గమ్మ అమ్మవారిని గాయత్రి దేవిగా, కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

స్వర్ణాలంకృత దుర్గాదేవిగా..

కుక్కునూరు: దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని స్వర్ణాలంకృత దుర్గాదేవి అవతారంలో అలంకరించారు. కుక్కునూరు శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి విగ్రహానికి పంచామృతాలతో అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. మండలంలోని గణేష్‌నగర్, రాజీవ్‌నగర్ రాజరాజేశ్వరి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చింతలపూడి: స్థానిక విశ్వనాథ మఠంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నారు. ఇందులో భాగంగా ఆశ్రమంలో వేంచేసిఉన్న రాజరాజేశ్వరీ అమ్మవారిని సోమవారం భక్తులు గాయత్రీదేవిగా అలంకరించారు. చింతలపూడి చుట్టు పక్కల గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు హాజరై అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆశ్రమానికి వచ్చే భక్తులకు దేవదాయశాఖ అధికారులు, ఆశ్రమం నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

గంగానమ్మకు సారె సమర్పణ


నూకాలమ్మ ఆలయం నుంచి సారెను తీసుకువస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ అమ్మవారు శోభాయాత్రతో కదలివచ్చి గంగానమ్మ అమ్మవారికి దసరా సాంప్రదాయ సారెను సమర్పించారు. వివిధరకాల పండ్లు, చీర, సారె, పసుపు, కుంకుమ, గాజులు, వివిధ రకాల మధుర పదార్థాలతో మేళతాళాలతో, భాజా భజంత్రీలతో, తీన్మార్ డప్పులు, కోలాటాలు, వేదమంత్రాల నడుమ ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) రామలక్ష్మి దంపతులతో కూడిన ఆలయ కమిటీ, శ్రీనూకాంబికా మహిళా సేవా బృందం, వందలాదిమంది భక్తులు భారీ ఊరేగింపుగా గంగానమ్మ దివ్యసన్నిధికి తరలివచ్చారు. సుమంగళీ ద్రవ్యాలతో కూడిన సాంప్రదాయ సారెను గంగానమ్మ అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ నూకాలమ్మ అమ్మవారి జాతరకు గంగానమ్మ అమ్మవారు సారె సమర్పిస్తారని, దసరాకు గంగానమ్మ అమ్మవారికి నూకాలమ్మ అమ్మవారు సారెను సమర్పిస్తారని తెలిపారు. ఏన్నో ఏళ్లుగా ఈ ఆచారం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఆశీర్వదించాలి


చర్చి ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న తలారి

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో కుల, మత, పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని తిరుమలంపాలెంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం సెయింట్ థామస్ చర్చ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్లు, సంఘస్తులు ఎమ్మెల్యేను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ క్రీస్తు అందరికీ దేవుడని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని మతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ హయంలో విజయవాడలో చంద్రబాబు కూలిన్చిన దేవాలయాలను జగనన్న తిరిగి నిర్మించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే పాస్టర్లకు జగనన్న సంక్షేమ ఫలాలను అందిస్తూ వారిని ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, గ్రామ సర్పంచ్ పల్లి నిర్మల, ప్రసాద్, ఎంపీటీసీ ఆకుర్తి సత్యనారాయణ, స్థానిక సొసైటీ చైర్‌పర్సన్ భోగరాజు చిన్ని, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, పెండ్యాల విజయ్ తదితరులున్నారు.

ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో కొలువైవున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో రూ.30 లక్షల వ్యయంతో అమ్మవారి ఆలయ నిర్మాణం చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహ శర్మ పర్యవేక్షణలో భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, విఘ్నేష్ దంపతులు పూజలు నిర్వహించారు.